

రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నోడల్ రిసోర్స్ సెంటర్, జవహర్ నాలెడ్జి సెంటర్ సంయుక్తంగా ఈనెల 29న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల నాలెడ్జి సెంటర్ కన్వీనర్ ఐ.లక్ష్మి, ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో అపోలో ఫార్మసీ, పేటిఎం, నవత రోడ్ ట్రాన్స్‌పోర్టు, ముత్తూట్, అరబిందో కంపెనీలు పాల్గొని ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్హతల ఆధారంగా ఈ ఎంపికలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

షట్టర్ల కేసు తేలేదెప్పుడు..?

- 2009లో షట్టర్ల కొనుగోళ్లలో అవినీతిపై సిఐడి కేసు
- కొత్తవి ఏర్పాటుకు అడ్డంకిగా కోర్టు కేసులు
- పలుచోట్ల శిథిలావస్థకు చేరిన వైనం
- శివారు భూములకు సాగు నీరందని పరిస్థితి

వంశధార శివారు భూములకు షట్టర్ల కుంభకోణం కేసు అడ్డంకిగా మారింది. షట్టర్ల కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై 2009లో సిఐడి కేసు నమోదు చేసింది. దీనిపై నేటికీ హైకోర్టులో విచారణ సాగుతోంది. విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేసి 15 ఏళ్లు అవుతున్నా, నేటికీ విచారణ కొలిక్కి రాలేదు. విచారణ పెండింగ్‌లో ఉండడంతో కాలువలపై కొత్త షట్టర్లను ఏర్పాటు చేసుకోలేక, పాత షట్టర్లతోనే నెట్టుకు రావాల్సిన పరిస్థితి. మరోవైపు సీజ్ చేసిన షట్టర్లు తుప్పు పట్టిపోవడంతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. వైసిపి ప్రభుత్వ హయంలో సాగునీటి సలహా మండలి, జిల్లా సమీక్షా కమిటీ సమావేశాలు తదితర సందర్భాల్లో వంశధార అధికారులు పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం కనిపించలేదు. కొత్త ప్రభుత్వమైనా ఈ అంశంపై దృష్టిసారిస్తే, రైతులకు కొంతవరకైనా మేలు చేకూరుతుంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



నందిగాం మండలం నరేంద్రపురం వద్ద షట్టరు దుస్థితి

నరసన్నపేట వంశధార ఇంజినీరింగ్ అధికారులు 2009లో కొనుగోలు చేసిన షట్టర్లలో బయటపడిన అవినీతి సాగు రంగానికి శాపంగా మారింది. అధిక ధరకు కొనుగోలు చేశారన్న ఆరోపణలపై సిఐడి రంగంలోకి దిగి విచారణ చేపట్టింది. ఇప్పటికీ ఆ కేసు కోర్టులో పెండింగ్‌లోనే ఉంది. 15 ఏళ్లు గడుస్తున్నా కేసు తేలకపోవడంతో, కాలువలపై ఏర్పాటు చేయాల్సిన షట్టర్లు కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి. హిరమండలం, టెక్కలి, కోటబొమ్మాళి, జలుమూరు ప్రాంతాల్లో గోడౌన్లలో సుమారు రూ.ఐదు కోట్ల విలువ చేసే 700 షట్టర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రస్తుతం ఇవి పాడైపోవడంతో కాలువలపై బిగించడానికి అవకాశం లేకుండా పోయింది. వాటిని వేలం వేసి, కొత్తగా కొనుగోలు చేయాల్సి ఉంది. అలా చేయాలంటే ప్రభుత్వం కేసును సాధ్యమైనంత తొందరగా ముగింపు పలకాల్సి ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ఇంజినీరింగ్ అధికారులు కొంతమంది జైలుకెళ్లారు. ఇద్దరు, ముగ్గురు అధికారులు మరణించినట్లు తెలిసింది. కేసును ఇంకా కొనసాగించినా ఫలితమేమీ ఉండదని, పైగా శివారు భూములకు సాగునీటి సమస్య పునరావృతమవుతూనే ఉంటుందని పలువురు ఇంజినీరింగ్ అధికారులు చెప్తున్నారు.

షట్టర్ల కేసు తేలకపోవడంపై అనేక సందేహాలు

ఏళ్ల తరబడి షట్టర్ల కేసు తేలకపోవడంపై అనేక సందేహాలు ఉన్నాయి. 2009లో వెలుగు చూసిన షట్టర్ల అవినీతిలో జెఇ నుంచి సిఇ వరకు 33 మంది ఇంజినీరింగ్ అధికారుల ప్రమేయం ఉన్నట్లు అప్పట్లో విజిలెన్స్ అధికారులు తేల్చారు. సంబంధిత కాంట్రాక్టు ఏజెన్సీకి అదనంగా రూ.18 కోట్లు చెల్లించినట్లు తేల్చారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నుంచి ఈ కేసు సిఐడికి బదిలీ కావడంతో మెటీరియల్ అంతటినీ సీజ్ చేసింది. దీంతో వాటిని వినియోగించడానికి అవకాశం లేకుండా పోయింది. తాము మెటీరియల్ సరఫరా చేసినా, బిల్లులు చెల్లించలేదంటూ సంబంధిత కాంట్రాక్టు ఏజెన్సీ హైకోర్టును ఆశ్రయించింది. 2009 నుంచి ప్రభుత్వాలు మారుతున్నా, ఈ సమస్య మాత్రం అపరిష్కృతంగానే ఉంది.

షట్టర్ల ఏర్పాటులో నిర్లక్ష్యం



వంశధార షట్టర్ల అవినీతిలో ప్రమేయం ఉన్న ఇంజినీర్లకు ఉద్యోగాలు ఇచ్చారు. షట్టర్లు వినియోగించడానికి ఇబ్బందేమిటో తెలియడం లేదు. షట్టర్లు లేక శివారు భూములకు సాగునీరందక పొలాలు ఎండిపోతుంటే, ఆ సమస్యను తేల్చకుండా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు ఏ కేసులు లేకున్నా కళింగదళ్, డబార్సింగి, దామోదరసాగర్ కాలువలపైనా షట్టర్లు ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వం, అధికారుల ఉదాసీనతకు అద్దం పడుతోంది. ఇప్పటికైనా సాగునీటి కాలువలపై షట్టర్లను వెంటనే ఏర్పాటు చేయాలి.

- కె.మోహనరావు,
జిల్లా కార్యదర్శి, ఎపి రైతుసంఘం

ఉద్యోగాలు ఇచ్చారు... షట్టర్లు ఆపేశారు

ప్రభుత్వం తలుచుకుంటే షట్టర్ల సమస్యలను ఒక కొలిక్కి తీసుకొచ్చే అవకాశమున్నా అది జరగడం లేదు. షట్టర్ల అవినీతిలో ప్రమేయం ఉన్న ఉద్యోగులను ప్రభుత్వం సస్పెండ్ చేసి ఆ తర్వాత వారికి ఉద్యోగాలు, వారిలో కొందరికి ఉద్యోగోన్నతులూ ఇచ్చింది. ఆ కేసులో ప్రస్తుతం వంశధార టెక్కలి ఇఇగా నియమితులైన బి.శేఖర్‌రావు ప్రమేయం ఉన్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తేల్చి రూ.70 లక్షలను రికవరీ చేయాలని ప్రభుత్వానికి సూచించింది. కేసు నమోదు సమయంలో ఆయన డిఇగా ఉన్నారు. ప్రస్తుతం ఆయనకు ఇఇగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఇంజినీరింగ్ అధికారులకు ఉద్యోగాలు ఇచ్చి, షట్టర్లను ఆపేయడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కేసు కొలిక్కి రాకపోవడంపై అనేక సందేహాలు

షట్టర్ల కేసులో ప్రమేయమున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కొంతమంది అధికారులు ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకుని ఫైలును తొక్కిపెట్టేలా చేస్తున్నారన్న వార్తలు గతంలోనే వచ్చాయి. ప్రస్తుతం వంశధార టెక్కలి ఇఇగా నియమితులైన శేఖర్‌రావు ప్రమేయం ఉన్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తేల్చింది. విజయవాడలో పనిచేస్తున్న ఆయన్ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇటీవల జిల్లాకు మళ్లీ తీసుకొచ్చారు. ఈ పరిణామాల నేపథ్యంలో కేసు ఫైల్‌ను అలానే ఉంచుతారా?, పరిష్కారమేమైనా చూపుతారా? అన్నది చూడాల్సి ఉంది. మొత్తమ్మీద ఏళ్ల తరబడి కేసు అపరిష్కృతంగా ఉండడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.



విద్యార్థి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

తొమ్మిది మంది విద్యార్థులకు అస్వస్థత

కలుషిత ఆహారమే కారణం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం నగరంలోని బలగలో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కలుషిత ఆహారం తీసుకున్న తొమ్మిది మంది విద్యార్థులు గురువారం అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారిని హుటాహుటిన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. వసతిగృహంలో మొత్తం 95 మంది విద్యార్థులు ఉండగా, వారిలో తొమ్మిది మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఐసియులో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ఆర్‌ఎంఒ డాక్టర్ భానుప్రకాష్ వైద్య సేవలను పర్యవేక్షించారు ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పారు.

మిగిలిన వారిని చిన్న పిల్లల వార్డులో ఉంచామని, శుక్రవారం డిశ్చార్జి చేస్తామని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ప్రాణాపాయం లేదని తెలిపారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీదేవి వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. బయట నుంచి తీసుకొచ్చిన నూడిల్స్ తిన్నారని, ఆ తర్వాతే వాంతులు, విరేచనాలు అయ్యాయని వారు వివరించారు. అనంతరం వారు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వెళ్లి విద్యార్థులకు అందుతున్న వైద్యసేవలను స్వయంగా పర్యవేక్షించారు.

ప్రతీకారం కాదు... పాలనపై దృష్టి పెట్టండి

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కూటమి ప్రభుత్వం ప్రతీకారంపై కాకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజా పాలనపై దృష్టిసారించాలని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు సూచించారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల కోడ్ కారణంగా నిలిపివేసిన రైతుభరోసా, మత్స్యకార భరోసా పథకాలకు తక్షణమే నిధులు విడుదల చేయాలన్నారు. ఎన్నికలకు ముందుకు సంక్షేమ పథకాల కోసం నిధులు సిద్ధంగా ఉన్నా, ఎన్నికల కోడ్ కారణంగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేయలేకపోయామని చెప్పారు. వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్న రైతులు రైతుభరోసా కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటై రెండు వారాలవుతోందని, ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో తల్లికి వందనం పథకం కింద నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలలు తెరుచుకున్నా విద్యా దీవెన, వసతి దీవెన డబ్బులు ఇంకా ఖాతాలలో పడలేదన్నారు. దీనిపై విద్యాశాఖ మంత్రి లోకేష్ ఇంతవరకు ఎలాంటి ప్రకటన ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు సంబంధించిన కేలండర్‌ను విడుదల చేయాలన్నారు. తాను సెంటు భూమి ఆక్రమించినా చర్యలు తీసుకోవాలన్నారు. భూ ఆక్రమణలపై చర్చకు తాను సిద్ధమని, ఎక్కడికి రమ్మన్నా వస్తానని సవాల్ విసిరారు. ప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో ముందుకెళ్తోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన 15 రోజుల్లోనే తనపై ఒక ఎఫ్ఐఆర్ నమోదైందని తెలిపారు. ప్రభుత్వ కక్షసాధింపులకు తాను మానసికంగా సిద్ధమయ్యానని చెప్పారు. ఎన్ని కేసులైనా ఎదుర్కొంటానని, జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయడమే తన లక్ష్యమన్నారు.

కూటమి ప్రభుత్వ కక్షసాధింపు

- మోసపూరిత హామీల వల్లే ప్రజలు పట్టం కట్టారు
- వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణదాస్

రాష్ట్రంలోని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం కక్షసాధింపు పాలన సాగిస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ప్రజల విశ్వాసం లేని నాయకుడని.. అందువల్లే జనసేన, బిజెపితో జతకట్టి ఎన్నికలకు వెళ్లారన్నారు. మూడు పార్టీలు కలిసినప్పుడే నైతికంగా ఓడిపోయారన్నారు. ప్రజల విశ్వాసం, మనో నిబ్బరం ఉన్న నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. చంద్రబాబు చెప్పిన మాయమాటలు, మోసపూరిత హామీలను నమ్మిన ప్రజలు కూటమికి పట్టం కట్టారని చెప్పారు. ఓట్ల శాతం పరంగా దేశంలోనే వైసిపి ఐదో స్థానంలో ఉందన్నారు. తెలుగుదేశం పార్టీకి వచ్చిన ఓట్ల కంటే వైసిపికి వచ్చిన ఓట్లే ఎక్కువని చెప్పారు. అధికారంలోకి వచ్చిన నెల రోజులు కూడా కాకుండా వైసిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు, విధ్వంస పాలనకు తెరతీశారని విమర్శించారు. 80 శాతం పూర్తయిన వైసిపి కార్యాలయాలను కూల్చివేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై న్యాయపరంగా పోరాటం చేస్తున్నామని చెప్పారు. ఇటువంటి కక్షసాధింపు, విధ్వంస చర్యలను ప్రజలు హర్షించరన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు పసుపు బిళ్ల పట్టుకుని వెళ్లే వారి పనిచేయకపోతే, తన సంగతి చూపిస్తానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను బెదిరించడం వారి పాలనకు అద్దం పడుతుందన్నారు. జిల్లాలో ఒకే కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర మంత్రి పదవులు ఇచ్చారని, ఆ పార్టీలో మిగిలిన వారంతా అసమర్థులని భావించారా అని ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని, ప్రజా సమస్యలపై పోరాడతామని చెప్పారు. ప్రజల విశ్వాసాన్ని చూరగొని 2029 ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి వస్తామన్నారు. సమావేశంలో వైసిపి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చదువులు చక్కదిద్దండి

ప్రజాశక్తి - కవిటి

పాఠశాలల విలీనంతో 3 నుంచి 5 తరగతులు సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో చేరిపోవడంతో ప్రాథమిక విద్య మిథ్యగా మారిందని, చాలా పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయని కవిటి, ఇచ్ఛాపురం మండలాలకు చెందిన పలువురు ప్రధానోపాధ్యాయులు ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాలల విలీనంతో ప్రాథమిక స్థాయి విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పలురకాల యాప్స్ ద్వారా అధిక సమయం వృథా అవుతోందన్నారు. ఉన్నత పాఠశాలల్లో బోధనేతర సిబ్బంది, డేటా ఆపరేటర్లు లేకపోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మధ్యాహ్న భోజన పథకం మెనూలో రాగి జావ మార్పు, నాడు-నేడు పనుల నిధుల విడుదల, ఉపాధ్యాయ పోస్టుల నియామకం తదితర అంశాలు ఎమ్మెల్యేకి వివరించారు. సమస్యలన్నీ సావధానంగా విన్న ఎమ్మెల్యే అశోక్ సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.రామకృష్ణ, భాస్కర్ రౌలో, ఎస్.విశ్వనాథం, ఎన్.విశ్వనాథం, బి.మల్లేశ్వరరావు, ఎం.వి రమణమూర్తి, జి.శాంతి, బి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు

మరోవైపు మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఎమ్మెల్యే అశోక్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం ఆరు గంటల నుంచే ఎమ్మెల్యే నివాసానికి చేరుకుంటున్న నాయకులు, అభిమానులు, అధికారులు, అనధికారులు అశోక్‌కు శుభాకాంక్షలు చెప్తూ తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు



కిట్లు పంపిణీ చేస్తున్న గొండు శంకర్

విద్యారంగానికి ప్రభుత్వ ప్రాధాన్యత

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. అందులో భాగంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిఎస్‌సిపై తొలి సంతకం చేశారని చెప్పారు. నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్, రూరల్ మండలంలోని కిష్టప్పపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో అనాలోచిత నిర్ణయాలతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తమైందని విమర్శించారు. నాడు-నేడు పేరుతో సమూల మార్పులు చేస్తున్నామని నమ్మించారే తప్ప విద్యార్థులకు పాఠాలు బోధించడానికి ఉపాధ్యాయుల గురించి పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో పంపిణీ చేస్తున్న కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ఘన చరిత్ర గల ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ పాఠశాల ఖ్యాతిని మరింత ఇనుమడింపజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, ఉప విద్యాశాఖాధికారి విలియం, ఎంఇఒ కృష్ణారావు, ప్రధానోపాధ్యాయులు సిహెచ్.దేవదాత్తనంద్, బి.సూర్యనారాయణ, పాఠశాల పూర్వ విద్యార్థి సంఘ నాయకులు వి.జి.కె మూర్తి, జామి భీమశంకర్, టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, డివిజన్ ఇన్‌ఛార్జి కెల్ల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో నాణ్యతకు పెద్దపీట

ప్రజాశక్తి - సోంపేట

ఉపాధి హామీలో చేపట్టే అన్నిరకాల పనుల్లోనూ నాణ్యతకు పెద్దపీట వేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి చిట్టిరాజు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట మండలాల ఉపాధి హామీ సిబ్బందితో గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో ప్లాంటేషన్ పనులను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. ఇంకా అవసరమైన మేరకు ప్లాంటేషన్ పనులకు సంబంధించిన అంచనాలు రూపొందించి తక్షణమే పంపించాలన్నారు. పంట కాలువల్లో పూడికతీత పనులను తక్షణమే పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఫారం పాండ్స్, ఖండిత కందకాలు, వృత్తాకార కందకాలు, ఇతర ప్రాధాన్యతా పనుల జాబితాలోని పనులను గుర్తించి అంచనాలను తయారు చేయాలన్నారు. లక్ష్యాల మేరకు కూలీలకు పని దినాలను కల్పించాలని, గరిష్ట కూలి అందే విధంగా సిబ్బంది అవసరమైన సూచనలు ఇవ్వాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది సమన్వయంతో పనిచేయడం ద్వారా ఉపాధి హామీ పనుల ప్రగతికి దోహదపడాలన్నారు. పని ప్రదేశాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని, రెండు పూటలా పనులు చేపట్టాలని సూచించారు. ఎటువంటి ఫిర్యాదులు రాకుండా సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎపిడి శ్రీనివాస్ రెడ్డి, కోర్సు డైరెక్టర్ వై.వి రమణ, అమ్మినాయుడు, మూడు మండలాల ఎపిఒలు, ఇసిలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు


మధ్యవర్తిత్వంతో కేసు పరిష్కారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారమైంది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా కేసును పరిష్కరించారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న T.P(C) 2542/2022, HMOP 29/2017 ఎఎస్‌సిజె కోర్టు కేసును పరిష్కరించారు. కుటుంబ కలహాలు రావడం సహజమని, వాటిని సరిదిద్దుకుంటే సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.సువర్ణరాజు, మధ్యవర్తిత్వ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

ప్రజాశక్తి
www.prajasakti.com


కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత

రాజీ మార్గమే రాజమార్గం
జూనియర్ సివిల్ జడ్జి ప్రసన్నలత

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కక్షిదారులు కేసులు రాజీ పడడం వల్ల సమయం, ఆదాయం దుర్వినియోగం కాకుండా ఉంటాయని, తక్షణమే న్యాయం జరుగుతుందని మండల న్యాయ సేవాసంఘం అధ్యక్షులు, జూనియర్ సివిల్‌జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. కోర్టు ఆవరణలో ముందస్తు లోక్‌అదాలత్‌ను గురువారం నిర్వహించారు. రాజీ పడదగ్గ పార్టీలను పిలిపించి వారితో చర్చించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు లఖినేని శ్రీనివాసులు, కార్యదర్శి తిరుమలరావు, బి.ధర్మారావు, ఎస్.అప్పలనాయుడు, వి.అప్పలనాయుడు, బి.జీవన్, సిహెచ్.వెంకట్రావు, ఎస్.శ్రీనివాస్, శ్రీధరరాజు, పల్లి వాసుదేవరావు, ఎజిపి ఎస్.తిరుపతి, ఎపిపి డి.హరిప్రియ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర కమిటీలో జిల్లా ఉద్యోగులకు చోటు

ప్రజాశక్తి- పోలాకి


రవికుమార్ గోపి

వైద్యారోగ్య ఉద్యోగుల సంఘం తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఎన్నికలు గురువారం మంగళగిరిలో ఏకగ్రీవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎన్‌జిఒ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ అశోక్ నేతృత్వంలో నూతన కమిటీని సభ్యులను ఎన్నుకున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఉద్యోగులకు రాష్ట్ర కార్యవర్గంలో కీలక పదవుల్లో చోటు దక్కింది. తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా డాక్టర్ నల్లి రవికుమార్, వాన సురేష్ కుమార్‌లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఎంపికైన కొత్త కార్యవర్గం రెండేళ్ల పాటు అధికారంలో కొనసాగుతుందని అన్నారు. ఉద్యోగుల సమస్యలు, హక్కుల కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తామని తెలిపారు. ఈ పదవి తనపై మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

బకాయిలు చెల్లించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న ప్రసాద్

కొత్తూరు: ఉపాధి హామీ కూలీలకు ఆరు వారాల కూలి బకాయిలను తక్షణమే చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపిడిఒ త్రివిక్రమరావును గురువారం కలిసి వినతిపత్రంఅ ందజేశారు. ఆరు వారాలుగా అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. అడిగిన వారందరికీ పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సుందరరావు, రాము, రమణ పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి

మండలంలోని కర్లెమ్మ పంచాయతీ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 202/5 బి, 201/2 దేవాదాయశాఖ చెందిన భూములను స్థానిక రెవెన్యూ అధికారులు అప్పనంగా కొంతమంది వ్యక్తులకు ధారాదత్తం చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని ప్రసాద్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికార యంత్రాంగం అక్రమార్కులకు కట్టబెట్టడం సరికాదని అన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాఠశాలలో రాజకీయ నాయకుల జోరు


కిట్లను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

- పోటాపోటీగా కిట్లు పంపిణీ
- ఎటు దారితీస్తుందోనని తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి- బూర్జ

పాఠశాలలో రాజకీయ నాయకుల హడావుడి కనిపిస్తుంది. ప్రస్తుతం పాఠశాలలు తెరిచిన సందర్భంగా ప్రభుత్వం విద్యార్థుల కోసం అందజేస్తున్న స్టూడెంట్ కిట్‌ల పంపిణీ కోసం పాఠశాల ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో ఉన్న ప్రజాప్రతినిధులను పిలవడం పరిపాటిగా మారింది. అయితే గురువారం మండలం నీలంపేటలో స్టూడెంట్ కిట్‌ల పంపిణీ కోసం ఉపాధ్యాయులు అధికార పార్టీ టిడిపి, వైసిపి నాయకులను ఆహ్వానించారు. అయితే ఒకే సమయంలో ఇరు పార్టీల నాయకులు రాకపోవడంతో ముందుగా వచ్చిన టిడిపి నాయకులతో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు ఇందులో భాగంగా టిడిపి నాయకులు లంక జగన్నాథం నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. కొద్ది నిమిషాల వ్యవధిలో వైసిపి నాయకులు సర్పంచ్ ప్రతినిధి జల్లు ఆదినారాయణ, ఎంపిటిసి ప్రతినిధి మజ్జి నరసింహారావుతో పాటు ఇతర కార్యకర్తలు పాఠశాల చేరుకోవడంతో ఉపాధ్యాయులు మరలా విద్యార్థులకు వారితో స్టూడెంట్ కిట్లను పంపిణీ చేపట్టారు. పాఠశాలలో రాజకీయ జోక్యం ఉండకూడదని స్పష్టంగా ఉన్నప్పటికీ ఇలా పలుమార్లు కార్యక్రమాలు చేపట్టడం ఎంతవరకు సమంజసమని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ విధమైన పరిణామాలు ఎటు దారితీస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పష్టమైన ఆదేశాలను జారీ చేయాలని, తద్వారా కార్యక్రమాలను చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని హెచ్ఎం కిరణ్ చంద్‌ను వివరణ కోరగా ఇరు పార్టీల నాయకులను ఒకేసారి ఆహ్వానించామని, అయితే వారు వేరువేరు సమయాల్లో రావడం జరిగిందన్నారు. ఏదిఏమైనా ఇటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


కిట్లను పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

ఎమ్మెల్యే దృష్టికి జీడి రైతుల సమస్యలు


వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ప్రజాశక్తి- పలాస

జీడి రైతులకు గిట్టుబాటు ధర లేక ఏటా ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం జీడి రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని జీడి రైతులు డిమాండ్ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బొడ్డపాడుకు చెందిన జీడి రైతులు ఎమ్మెల్యే గౌతు శిరీషకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు గిట్టుబాటు ధర కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటిశాఖ మంత్రి నారా లోకేష్, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం జీడి పిక్కలను కొనుగోలు కేంద్రాల ద్వారా 80 కేజీల బస్తా రూ.16 వేలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జీడి, కొబ్బరి పంటలకు బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. వంశధార కాలువ ఉద్దాన గ్రామాల కలుపుతూ ఇచ్ఛాపురం వరకు పొడిగించాలన్నారు. రైతులు తీసుకున్న అన్నిరకాల రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలు మంజూరు చేయాలని కోరారు. తిత్లీ తుపానులో నష్టపోయిన రైతులకు రూ.7 వేలు పరిహారం అందించాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పంటలకు అనుసంధానం చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కిక్కర ఢిల్లీరావు, మాజీ సర్పంచ్ తామడ త్రిలోచన రావు, దాసరి శ్రీరాములు, రైతులు ఎం.మాధవరావు, గంగయ్య, తులసీరావు, టి.అప్పారావు, రాజాం గుణవంతు, రామారావు పాల్గొన్నారు.


వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రతి ఎకరాకూ సాగునీరు
ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు: ఈ ఖరీఫ్ సీజన్ నుంచే ప్రతి ఎకరాకూ సాగునీరు అందించేటట్లు చూడాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదేశించారు. జలుమూరు మండలం పెద్దదుగాం వద్ద ఎడమ కాలువ (లెఫ్ట్ మెయిన్ కెనాల్) వంశధార కాలువను 24 ఎన్‌బిసి ఛానల్ ఆధునికీకరణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వంశధార అధికారులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా మొట్టమొదటి సారిగా వ్యవసాయ రంగానికి పెద్ద పీటవేస్తున్నామని అన్నారు. ప్రతి రైతుకూ నాణ్యమైన విత్తనాలు, ప్రతి ఎకరానికీ సాగునీరు అందించే దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. రైతుల సహకారంతో కాలువలో పూడికలు తొలగించాలన్నారు. కార్యక్రమంలో వంశధార డిఇ శ్రీహరి, సురేష్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్ర నాయుడు, బగ్గు గోవిందరావు, గుండ మన్మథరావు, దుంగ స్వామిబాబు, పి.వెంకటరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఎచ్చెర్ల : ధర్మవరం, కొయ్యం సబ్‌స్టేషన్ నిర్వహణ కారణంగా ధర్మవరం, కొయ్యం సబ్‌స్టేషన్ పరిధిలో కొయ్యం, కె.కె.నాయుడుపేట, అజ్జరం, బడివానిపేట, నిమ్మవానిపేట, ధర్మవరం, పొన్నాడ, బొంతల కోడూరు, ముద్దాడ, కొంగరం, డి.మత్స్యలేశం తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.బయ్యన్నాయుడు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సేవలను కొనసాగిస్తాం

ఆమదాలవలస : మీసేవ కేంద్రాల్లో సేవలు గతంలో కొనసాగేటట్లే ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో రవికుమార్ స్వగృహంలో నియోజకవర్గ మీసేవ కేంద్ర నిర్వాహకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. గతంలో ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేసే మీ సేవ కేంద్రాలు గత ప్రభుత్వం నిర్లక్ష్యం వలన మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. మీసేవలపై ప్రస్తుత ప్రభుత్వం శాఖాపరమైన చర్యలు తీసుకొని మీసేవ కేంద్రాలకు పూర్వ వైభవం తీసుకురావాలని వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో అన్నెపు రమణమూర్తి, మొదలవలస సురేష్, బూర్జ మండల మీసేవ కేంద్రం ఆపరేటర్ పప్పల హరినాధరావు, సనపల హరి ప్రతాప్, బొడ్డేపల్లి అప్పలనాయుడు, అన్నెపు రమేష్ పాల్గొన్నారు.


ఆమదాలవలస : వినతిపత్రం అందిస్తున్న మీసేవ నిర్వాహకులు

పొందూరు: పొందూరు మండల సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఎమ్మెల్యే రవికుమార్‌ను ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లను వివిధ రకాల ఇంజనీరింగ్ విభాగాల్లో రేషనలైజేషన్ చేయాలని, వారికి ప్రమోషన్ కల్పించడంతో పాటు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు.

కేరళలో జిల్లావాసి మృతి

ప్రజాశక్తి- కవిటి


కాళీప్రసాద్ (ఫైల్)

కేరళలో ఓ ప్రయివేట్ కంపెనీలో పనిచేస్తున్న కరాపాడుకు చెందిన నర్తు కాళీప్రసాద్ (25) ఇటీవలే గ్రామానికి వచ్చాడు. ఈదుపురానికి చెందిన యువతితో నిశ్చితార్థం జరుపుకున్నాడు. ఇరు కుటుంబాలతో సరదాగా గడిపాడు. సెలవుల గడువు ముగియడంతో వారం రోజుల క్రితమే కేరళ పయనమయ్యాడు. విధి నిర్వహణలో భాగంగా బుధవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఈ సంఘటన తెలిసి కాళీప్రసాద్ తల్లిదండ్రులు మాకయ్య, మోహిని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాళీప్రసాద్ అన్నయ్య దుబాయిలో ఉండగా అక్కకు వివాహం జరిగి అత్తవారింట్లో ఉంది. స్థానిక సర్పంచ్ ఎం.లచ్చయ్య మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఇటీవలే నిశ్చితార్థం చేసుకుని తమతో పాటు సరదాగా గడిపిన కాళీప్రసాద్ ఆకస్మిక మృతితో గ్రామంలో విషాద ఛాయలు ఏర్పడ్డాయి.

అన్నదమ్ముల కొట్లాట

నందిగాం : మండలంలోని దేవలభద్రలో అన్నదమ్ములు దీర్ఘాసి ఆదినారాయణ, దీర్ఘాసి జనార్ధనరావులు పొలం విషయమై గురువారం కొట్లాట జరిగింది. వీరికి ఉమ్మడి ఆస్తి 40 సెంట్లు ఉంది. అందులో ఆదినారాయణ ఉదయం పొలం పనులు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న తమ్ముడు జనార్ధనరావు వెళ్లి ఈ పొలం ఉమ్మడి ఆస్తి అని, నీవు ఒక్కడే అనుభవిస్తే ఎలా అని అన్నను ప్రశ్నించారు. దీంతో వీరిద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో తమ్ముడు జనార్ధనరావు కోపోద్రిక్తుడై అన్న ఆదినారాయణ తలపై పారతో కొట్టాడు. ఈ ప్రమాదంలో ఆదినారాయణ గాయపడడంతో కుటుంబ సభ్యులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆదినారాయణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న ఎస్ఇబి సిబ్బంది

నాటుసారా పట్టివేత

కవిటి: మండలంలోని కరాపాడు వద్ద ఎస్ఇబి మొబైల్ పెట్రోలింగ్ టీమ్ 50 పేకట్ల నాటుసారాతో పాటు వ్యక్తిని అదుపులోకి తీసుకుంది. ఎస్ఇబి సిఐ ఎం.విజయలక్ష్మి అందించిన సమాచారం మేరకు మొబైల్ పెట్రోలింగ్ టీమ్ ఎస్ఐ పి.నరేంద్ర కుమార్ నేతృత్వంలోని మండలంలోని కరాపాడు వద్ద గురువారం తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో దూగానపుట్టుగకు చెందిన దూగాన ఢిల్లేశ్వరరావు ఒడిశా రాష్ట్రంలోని తూటుపురం నుంచి దూగానపుట్టుగలో విక్రయించేందుకు మోటారు సైకిల్‌పై నాటుసారా తరలిస్తుండగా పట్టుబడ్డాడు. దీంతో బాలుని అరెస్టు చేసి నాటుసారా, మోటార్ సైకిల్ సీజ్ చేసి ఇచ్ఛాపురం ఎస్ఇబి స్టేషన్‌కు తరలించి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో కానిస్టేబుళ్లు బి.కుమార్ నాయక్, ఎన్.టి.నాయుడు పాల్గొన్నారు.


సామగ్రిని స్వాధీనం చేసుకున్న సిబ్బంది

బెల్లంఊటలు ధ్వంసం

సోంపేట : మందస మండలం కొండలోగం పంచాయతీ పరిధిలో గురువారం నిర్వహించిన దాడుల్లో సుమారు 1900 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ దాడులు చేశామన్నారు. నాటుసారా అక్రమ తయారీ, రవాణాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్న మన్నారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సిఐ రామచంద్ర కుమార్, సిబ్బంది కాంతారావు, భీమారావు, మోహన్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న ఎంపిటిసి జగదీశ్వరరావు

సమస్యలను పరిష్కరించాలి

ఎచ్చెర్ల : కేశవరావుపేట పంచాయతీలో ఎన్‌హెచ్ 16కు ఆనుకుని ఉన్న బిటి రోడ్డులో 8 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు జరుపుతుంటారని, వర్షం పడితే ఈ రహదారిలో ప్రజల రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారని, రహదారికి ఇరువైపుల కాలువలు లేకపోవడంతో వర్షపునీటితో రహదారి చెరువును తలపిస్తుందని ఎంపిటిసి సూర జగదీశ్వరరావు ఎమ్మెల్యే ఎన్ఇఆర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ గ్రామానికి ఆనుకుని ఉన్న మరొక గ్రావెల్ రోడ్డు కూడా బురదమయంతో, గుంతలతో ప్రజలు రాకపోకలు సాగించుటకు కష్టసాధ్యంగా ఉందన్నారు. ఈ రహదారుల సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదని విన్నవించారు. తమ సమస్యలు పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.

పట్టణంలో విద్యుత్ వెలుగులు

టెక్కలి రూరల్ : జగతి మెట్ట కూడలి నుంచి చేరి వీధి ఫ్లేవర్ వరకు సెంట్రల్ లైటింగ్స్ విద్యుత్ దీపాల కాంతులతో టెక్కలి పట్టణం శోభాయమానంగా కనిపించింది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా టెక్కలి సెంట్రల్ లైటింగ్స్‌పై నిర్లక్ష్యం అలుముకోవడంతో పట్టణంలో చీకటి నెలకొంది. తాజాగా వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలతో అధికారులు యుద్ధప్రాతిపదికన సెంట్రల్ లైటింగ్స్, పనులు చేపట్టారు.



డిగ్రీ కళాశాలల సమస్యలు పరిష్కరించాలి


కేంద్రమంత్రిని సన్మానిస్తున్న మురళీధర్

ప్రజాశక్తి- టెక్కలి

ఆంధ్రాలోని ప్రయివేటు డిగ్రీ కళాశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ప్రయివేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కోత మురళీధర్ కోరారు. ఈ మేరకు ఢిల్లీలోని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎఐసిటిఇ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పనలో భాగంగా మంజూరు కావలసిన నిధులను మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు చదువులు పూర్తయినా కళాశాలలకు జమ కావలసిన బకాయిలు లేకపోవడంతో ప్రయివేటు డిగ్రీ కళాశాలలు నిర్వీర్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ముడిపడి ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విన్నతించారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. అలాగే విశాఖపట్నం ఎంపీ భరత్‌నూ ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈయన వెంట అసోసియేషన్ నాయకులు పొన్నాడ జయరాం, గొంతు శ్రీనివాస్, గుండారెడ్డి, గుర్రాల వెంకట్ రెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

కిట్లు పంపిణీ

వజ్రపుకొత్తూరు: టిడిపితోనే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని గోవిందపురం పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. మండలంలోని గోవిందపురం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు హరిబాబు అధ్యక్షతన విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు, పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సీపాన గోపి, టిడిపి ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, గొర్లె గణేష్, లావేటి శంకర్, పుచ్చ సారథి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొందూరు: మండలం గోకర్ణపల్లి ప్రాథమిక పాఠశాలలో జిల్లా టిడిపి కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పాఠ్య పుస్తకాలతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. హెచ్ఎం టి.రత్నకుమారి, గురుగుబెల్లి రామారావు, సీపాన వెంకటరమణారావు, గురుగుబెల్లి నర్సింగరావు, చౌదరి వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కిట్లను అందజేస్తున్న శ్రీరంగనాయకులు

ఛాలెంజ్‌గా ప్రశ్నాపత్రాల తరలింపు

పోస్టల్ పర్యవేక్షకులు చంద్రమోహన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం


చంద్రమోహన్

ప్రభుత్వం నిర్వహించిన ఎస్ఎస్‌సి, ఇంటర్, ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించి ప్రశ్నాపత్రాలు వాల్యూషన్ సెంటర్‌కు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా పోలీస్ సెక్యూరిటీ లేకుండా తరలించడం నా ఉద్యోగ జీవితంలో సంతృప్తినిచ్చిందని పోస్టల్ పర్యవేక్షకులు బుడుమూరు చంద్రమోహన్ అన్నారు. ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. లావేరు మండలం బుడుమూరు గ్రామంలో రాజేశ్వరరావు, సత్యవతి దంపతులకు ఆరో సంతానంగా చంద్రమోహన్ 1964 జూన్ నెలలో జన్మించారు. స్వస్థలం బుడుమూరులోనే ప్రాథమిక విద్య ప్రారంభించి 5 వరకు చదివారు. అదపాక హైస్కూల్‌లో 6 నుంచి 8 వరకు చదివారు. పెద్దన్నయ్య వెంకట నరసింహం ఉద్యోగరీత్యా ఇచ్ఛాపురం, జలుమూరు మండలం ఉర్లాం గ్రామాల్లో పనిచేయడంతో ఆయా ప్రాంతాల్లో 9 తరగతి పూర్తి చేసి, 1980లో ఆమదాలవలసలో 10వ తరగతి పూర్తి చేశారు. 1980 నుంచి 1982 వరకు ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. ఇంటర్ చదువుకున్న చంద్రమోహన్ సొంత గ్రామం బుడుమూరులోనే కొంత కాలం ట్యూషన్లు చెబుతూ తల్లిదండ్రులకు సాయపడ్డారు. 1984లో బుడుమూరులోనే అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించి పదిహేడేళ్లు అక్కడే పనిచేశారు. 2002లో ఉద్యోగోన్నతిపై శ్రీకాకుళం హెడ్ పోస్టాఫీస్‌లో పోస్ట్‌మేన్‌గా మూడేళ్లు పనిచేశారు. 2006 నుంచి 2009 వరకు హెడ్ పోస్టాఫీస్‌లో, 2012లో పదోన్నతి పొంది పోస్టల్ పర్యవేక్షకులుగా పనిచేస్తున్నారు. 2022లో రెండోసారి పోస్టల్ పర్యవేక్షకులుగా ప్రమోషన్ పొంది నేటివరకు హెడ్ పోస్టాఫీస్‌లోనే పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ శ్రీకాకుళం డివిజన్ కార్యదర్శిగా 18 ఏళ్లపనిచేసి పోస్టల్ ఉద్యోగుల హక్కులకోసం అనేక పోరాటాలు సామరస్యంగా చేసి సమస్యలు పరిష్కరించానని ఆయన వివరించారు.

కుటుంబ నేపథ్యం

భార్య రాజేశ్వరి గృహిణి, కుమారుడు వసంత కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


కొత్తూరు : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- కొత్తూరు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందితుందని ఎంపిడిఒ త్రివిక్రమరావు, ఎంఇఒలు గోవిందరావు, శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.గోవిందరావు అధ్యక్షతన బడికిపోదాం కార్యక్రమంలో విద్యార్థులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, దుస్తులు, పుస్తకాలు, నోట్‌బుక్స్, బూట్లు తదితర సామగ్రి ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని అన్నారు. అనంతరం ఎంఇఒలు స్టూడెంట్స్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, మల్లారెడ్డి పద్మనాభరావు అన్నారు. మండలంలోని వసుంధరలో బడికిపోదాం కార్యక్రమం నిర్వహించారు. వసుంధర కాలనీ, నడసంద్ర కాలనీ, మెయిన్ రోడ్లు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించామని అన్నారు. ప్రయివేటు పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.లలితకుమారి, ఉపాధ్యాయులు భాస్కరరావు, డి.బాబూరావు పాల్గొన్నారు.

నీటమునిగిన నారుమడులు

ప్రజాశక్తి- బూర్జ

గత రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ఆకుమడులు పూర్తిగా నీటి మునిగాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో అడపాదడపా కురిసిన వర్షాలకు మండలంలోని చీడివలస, వై.పర్త, అల్లెన, లాభాం, లంకాం తదితర గ్రామాల్లో రైతులు విత్తనాలను చల్లారు. అయితే మడులన్నీ నీట మునగడంతో విత్తనాలు పాడవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షానికి మొత్తం ఆకుమడులు నీట మునిగాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నీటమునిగిన నారు మడులు

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు


ఆమదాలవలస : పిచ్చిమొక్కలను తొలగిస్తున్న గ్రామస్తులు

ఆమదాలవలస : మండలంలోని ఇసకలపేటలో తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ ఆదేశాల మేరకు కార్యదర్శి హరీష్ ఆధ్వర్యాన గురువారం ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపట్టారు. గ్రామానికి శివారు ఉన్న బోరు వద్ద పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో తాగునీటి బోరు వద్ద అపరిశుభ్రంగా లేకుండా క్లోరినేషన్ చేపట్టామని అన్నారు. వీధుల్లో మురుగునీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెందుతాయని, వాటివల్ల డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని అవగాహన కల్పించారు. అందుకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వాడుకనీరు వీధుల్లోకి విడిచిపెట్టకుండా ఇంకుడుగుంతల్లో నీరు ఇంకేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులకు సూచించారు. వీధుల్లోకి నీరు విడిచిపెడితే శాఖాపరమైన చర్యలు తప్పవని ఇంటింటికీ వెళ్లి హెచ్చరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పేడాడ అశోక్, కె.రామ్మోహనరావు, ఎ.సూర్యనారాయణ, టి.నర్సింగరావు, పి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం యామలపేటలో సర్పంచ్ ప్రతినిధి ముదిలి సంజీవ్, ఎంపిటిసి మాజీ సభ్యులు రామిరెడ్డి ఆధ్వర్యాన గురువారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరవైపులా జంగిల్ క్లియరెన్స్ చేయించారు. కాలువల్లో పూడికలు తొలగించారు. కార్యక్రమంలో కార్యదర్శి కేశవ పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాలతో పూర్తిస్థాయిలో నీరు

క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్ డిప్యూటీ ఇఇ కృష్ణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

తాగునీరు ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రజలకు మంచినీరు అందించడం ఉద్యోగ జీవితంలో సంతృప్తినిచ్చిందని శ్రీకాకుళం పిఆర్ క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భోగాది కృష్ణ తెలిపారు. ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. 1962లో బొబ్బిలి మండలం పిరిడి గ్రామం మధుర కొల్లివలసలో 1962 జూలై 1న తల్లి రాములమ్మ, తండ్రి అప్పయ్య దంపతులకు మొదటి సంతానంగా జన్మించారు.

విద్యాభ్యాసం

1968లో జన్మస్థలం కొల్లివలసలోనే 1 నుంచి 5 వరకు చదివి, 6 నుంచి 10 వరకు పిరిడి జడ్‌పి ఉన్నత పాఠశాలలో చదివి 1978లో 10వ తరగతి పూర్తి చేశారు. 1978 నుంచి 1981 వరకు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నికల్ కాలేజీలో పాలిటెక్నికల్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.

ఉద్యోగ జీవితం

1982 డిసెంబర్‌లో పంచాయతీరాజ్ ఆమదాలవలస సబ్ డివిజన్‌లో టెక్నికల్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. 1982 నుంచి 1987 వరకు ఆమదాలవలసలో, 1987 నుంచి 1992 వరకు రణస్థలం సబ్ డివిజన్‌లో, 1992 నుంచి 1999 వరకు అదే సబ్ డివిజన్‌లో థర్డ్ గ్రేడ్ గ్రాఫ్‌మేన్‌గా, అదే సంవత్సరం విశాఖపట్నం సర్కిల్ ఆఫీసులో ఆర్‌డబ్ల్యుఎస్ అసిస్టెంట్ ఇంజనీర్‌గా 2004 వరకు పనిచేశారు. 2004లో శ్రీకాకుళం డిపిఎపి డిపార్ట్‌మెంట్‌లో, 2004 నుంచి 2007 వరకు ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇగా ఆమదాలవలసలో, 2007 నుంచి 2010 వరకు ఎచ్చెర్ల మండలంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇగా పనిచేశారు. 2010 నుంచి 2017 వరకు పంచాయతీరాజ్ పిఐయు సబ్ డివిజన్ పొందూరులో, 2017 నుంచి పిఐయు డివిజన్ శ్రీకాకుళంలో పనిచేశారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి డిప్యూటీ ఇఇగా శ్రీకాకుళం పంచాయతీరాజ్ పిఐయు డివిజన్‌లో బాధ్యతలు నిర్వహిస్తు ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్నారు.

సంతృప్తినిచ్చే అంశం

42 ఏళ్లలో శ్రీకాకుళం డిపిఎపి డిపార్ట్‌మెంట్‌లో వాటర్‌హెడ్, ఆమదాలవలసలో వాటర్ స్కీమ్‌ల ద్వారా ప్రజలకు నీటిని అందించడం సంతృప్తినిచ్చిందన్నారు.

అవార్డులు

జిల్లాలో డిపిఎపిలో పనిచేసినప్పుడు 2004 జనవరి 26 రిపబ్లిక్ డే రోజు జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ అధికారి అవార్డు, 2022 జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా రెండోసారి ఉత్తమ అధికారి అవార్డు జిల్లా కలెక్టర్ చేతులమీదుగా అందుకున్నానన్నారు.


కృష్ణ, డిప్యూటీ ఇఇ

కుటుంబ నేపథ్యం

భార్య భోగాది గౌరీదేవి గృహిణి, పెద్ద కుమార్తె అరుణశ్రీ ఎంబిఎ, అల్లుడు రూప సోమేశ్వరరావు, బిజినెస్. చిన్న కుమార్తె పావని బిటెక్, కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశారు. చిన్నల్లుడు మోహన్ మురళి మారుతి సుజుకిలో సీనియర్ మేనేజర్‌గా అహ్మదాబాద్‌లో పని చేస్తున్నారు. మనవళ్లు దక్షిత్, నవ కిరణ్, తేజ్ ఉన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పలాస నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని పెద్దమురహరిపురంలో సర్పంచ్ గోరకల వసంతస్వామి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. పంచాయతీ నిధులు రూ.3 లక్షలతో 120 మీటర్ల పొడవుతో సిసి రోడ్లుకు, ఎంపీ ల్యాడ్ నిధులు రూ.2.50 లక్షలతో గ్రంథం చెరువుకు మెట్లు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. మరో రూ.20 లక్షలు ఎంపీ ల్యాడ్ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పూండి మందిగిల్లాపేట రహదారి విస్తరణకు ప్రణాళిక రూపొందించి డబుల్ రోడ్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి వసంతరావు, టిడిపి మండల అధ్యక్షులు సురద మోహనరావు, మాజీ సర్పంచ్ కలిసెట్టి గోపాల్, పుచ్చ ఈశ్వరరావు, కర్నీ రమణ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ ఇఒపిఆర్‌డిలదే

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

గ్రామాల్లో పారిశుధ్య లోపంతో ఎటువంటి సమస్యలు తలెత్తినా ఇఒపిఆర్‌డిలదే పూర్తి బాధ్యతని డిఎల్‌పిఒ గోపీబాల స్పష్టం చేశారు. గురువారం మండలంలోని కొత్తకోట, బప్పడాం గ్రామాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. రానున్నది వర్షాకాలం సీజన్ అని పారిశుధ్య నిర్వహణపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో చెత్త కుప్పలు, మురుగునీరు నిల్వ లేకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తకోట సర్పంచ్ సురవరపు జగదీశ్వరరావు, ఇఒపిఆర్‌డి ఆనందబాబు, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


షోరూంను ప్రారంభిస్తున్న సునీల్‌రాజ్

తనిష్క్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

టాటా సంస్థకు చెందిన జ్యువెలరీ రిటైల్ బ్రాండ్ తనిష్క్ షోరూంను తనిష్క్ రిటైల్ హెడ్ సునీల్‌రాజ్ గురువారం ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో భాగంగా కొనుగోలు దారులకు ప్రతి కొనుగోలుపై ఉచిత బంగారు నాణెం అందిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 29 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని సునీల్ రాజ్ ప్రకటించారు. నగరంలోని పాలకొండ రోడ్‌లో దాదాపు 5400 చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ స్టోర్ బంగారం, అద్భుతమైన వజ్రాలు, కుందన్, పోల్కీలో అత్యున్నతమైన తనిష్క్ డిజైన్ల యొక్క విస్తృతమైన శ్రేణిని నగలు అందిస్తున్నట్టు తెలిపారు. ఆధునిక, సమకాలీన, తేలికపాటి ఆభరణాల కలెక్షన్ 'స్ట్రింగ్ ఇట్'తో పాటు అద్భుతమైన వైవిధ్యమైన శ్రేణి డైమండ్ ఆభరణాలు 'డైమండ్ ట్రీట్స్' ఉన్నాయన్నారు. వీటితో పాటు వివాహ ఆభరణాల ఉప-బ్రాండ్ అయిన 'రివా' నుంచి అద్భుతమైన ఆభరణాలతో పాటుగా ధరించేందుకు అనువైన ఆభరణాల 'గ్లామ్స్' బహుముఖ శ్రేణి అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఇది 15వ స్టోర్‌గా నిలుస్తుందన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో మజ్జిలిపేటలో చిన్న జీయర్ స్వామి ఆదేశాల మేరకు గురువారం నిర్వహించిన మహిళా ఆరోగ్య వికాస్ వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చింది. వికాసతరంగణి వైద్యులు డాక్టర్ మాలతి 85 మంది మహిళలకు వైద్యసేవలందించారు. వారిలో కొంత మందికి సెర్వికల్, బ్రెస్ట్‌లో ఇన్‌ఫెక్షన్ ఉన్నట్లు నిర్ధారించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరానికి సర్పంచ్ గురుగుబెల్లి సుధారాణి, వికాస తరంగణి చీఫ్ కో-ఆర్డినేటర్ మెట్ట ఉషశ్రీ జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో వికాస తరంగణి మహిళా ఆర్యోగ వికాస్ సమన్వయకర్త శ్యామల, సిబ్బంది జయలక్ష్మి, రామానుజదాసు, చక్రధర్, వెంకట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో వరి విత్తనాలు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రైతులకు అందుబాటులో వరి విత్తనాలు ఉన్నాయని సర్పంచ్ రజిని అన్నారు. మండలంలోని బంటుపల్లి గ్రామ సచివాలయంలో అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయాధికారులు చెప్పిన సూచనలు పాటిస్తు అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌సి మాజీ ఛైర్మన్ వెలిచేటి సురేష్ కుమార్, గురాల జగన్నాధరావు, వార్డ్ మెంబర్ కరుణమ్మ, శంబర సురేష్, పసుపురెడ్డి రమణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ మహేష్, సెక్రటరీ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేత్రాలపై అప్రమత్తం

రణస్థలం: నేత్రాలపై అప్రమత్తంగా ఉండాలని కళ్యాణి కంటి ఆస్పత్రి పారామెడికల్ అప్తాలమిక్ ఆఫీసర్ ఎస్.కళ్యాణి తెలిపారు. మండల కేంద్రం బ్రహ్మణ వీధిలో ఉన్న కళ్యాణి కంటి ఆస్పత్రి ఆవరణలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 93 మంది హాజరయ్యారు. వైద్య పరీక్షలు నిర్వహించి 23 మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేసి శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ కంప్యూటర్ ముందు ఎక్కువసేపు పనిచేసేవారు తప్పనిసరిగా మధ్యలో కాస్త విరామం తీసుకోవాలని, క్యారెట్, తాజా పండ్లు, ఆకుకూరలు, పాలు, గుడ్డులోని పచ్చసొనల్లో విటమిన్ ఎ ఉంటుందని ఇది కంటి ఆరోగ్యానికి మంచిదని, ఈ పదార్థాల్లో ఉండే విటమిన్ సి,ఇ లు అనేక కంటి సమస్యలను దూరం చేస్తాయన్నారు.కార్యక్రమంలో క్యాంపు కో-ఆర్డినేటర్ సోమేష్ పాల్గొన్నారు.

పారిశుధ్య మెరుగుకు చర్యలు

ఇచ్ఛాపురం : వర్షాకాలంలో ప్రబలుతున్న మలేరియా, డెంగీ, డయేరియా వ్యాధులు నియంత్రణకు ప్రజలు చైతన్యవర్తి తగిన చర్యలు తీసుకోవాలని డిపిఎం ప్రసాద్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన పారిశుధ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరుబయట కొబ్బరి చిప్పలు, టైర్లలో నీటి నిల్వ లేకుండా చూడాలన్నారు. తడి, పొడి చెత్తను రోజూ హరిత అంబాసిడర్లకు అందజేయాలన్నారు. సమావేశంలో ఎఇ విష్ణుమూర్తి, సిడిపిఒ నాగరాణి, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, డాక్టర్లు సంతోష్, కళ్యాణి పాల్గొన్నారు.

కవిటి : మండలంలోని అన్ని పంచాయతీల్లో ముమ్మరంగా పారిశుధ్యం పనులు చేపట్టాలని ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డి కార్యదర్శులకు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కార్యదర్శులతో, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో వ్యాధుల తీవ్రత పెరిగే ప్రమాదం ఉందని అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి పంచాయతీలోనూ పారిశుధ్యం పనులు పక్కాగా చేపట్టాలని సూచించారు. అలాగే గ్రామాలు, డంపింగ్ యార్డులు, నాళాలు, ట్యాంకుల్లో బ్లీచింగ్ చల్లాలన్నారు. పంచాయతీ అభివృద్ధి సూచిక ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వంశీకృష్ణ, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, సీనియర్ అసిస్టెంట్ ప్రధర్, కవిటి పంచాయతీ ఇఒ వీరభద్ర స్వామి పాల్గొన్నారు.

కంచిలి : మండలంలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి వి.జయరాజ్ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్షించారు. తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్, డ్రైనేజీల్లో


ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న ప్రసాద్

పూడికతీతలో చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వి.నీరజ, పశువైద్యాధికారి శిరీష తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలో పంచాయతీ పరిధిలో గల అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టి సారించి ముమ్మరంగా పనులు చేపట్టాలని జిల్లా గృహ నిర్మాణశాఖ పిడి, మండల ప్రత్యేకాధికారి ఎన్.గణపతిరావు అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, ఇఒపిఆర్‌డి సింహాచలం, సర్పంచ్ రేగడి లక్ష్మి, ఇఒ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నపై తప్పుడు ప్రచారం తగదు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నదుకుదిటి ఈశ్వరరావులపై వైసిపి చేస్తున్న తప్పుడు ప్రచారం తగదని తెలగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రొక్కం సూర్యప్రకాష్ అన్నారు. నగరంలోని మహాలక్ష్మీనగర్ కాలనీలో గల ఆయన నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. రణస్థలం మండలంలో బీరు పరిశ్రమపై కూటమికి చెందిన నాయకులు దాడులకు పాల్పడ్డారని, కప్పం కడితేనే పరిశ్రమ నిర్వహణకు అవకాశం కల్పిస్తామని మంత్రి, ఎమ్మెల్యేలపై విష ప్రచారం భావ్యం కాదన్నారు. పరిశ్రమ నుంచి రోజుకు 500 లారీలు బయటకు వెళు_న్నాయని, లారీకి రూ.1000 చొప్పున రూ.ఐదు లక్షలు చెల్లించాలని ఎమ్మెల్యే పరిశ్రమ యాజమాన్యానికి బెదిరించినట్టు చేస్తున్న ప్రచారం విషపూరిత చర్యన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న రాజ్యలక్ష్మి

బారువ ఆస్పత్రి సందర్శన

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని బరువ ప్రభుత్వాస్పత్రిని డిసిహెచ్‌ఎస్ రాజ్యలక్ష్మి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రిలో అందిస్తున్న సేవలు గురించి తెలుసుకొన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రిలో జరుగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈమెతో పాటు వైద్యులు బాలకృష్ణ, దుర్యోధన, హేమంత్ కుమార్ ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

ప్రజాశక్తి- లావేరు

ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు శుక్రవారం మండలంలో పర్యటించనున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ తెలిపారు. అధపాక నుంచి వెంకటాపురం వెళ్లే నూతనంగా నిర్మించిన బిటి రహదారిని అధపాక గ్రామంలో శుక్రవారం ఉదయం పది గంటలకు ఎమ్మెల్యే చేతులుమీదగా ప్రారంభించ నున్నట్లు సురేష్ తెలిపారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సంజీవయ్య ట్రస్టు సేవలు ప్రశంసనీయం

శ్రీకాకుళం అర్బన్: దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య ట్రస్టు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ప్రతినిధి ఎస్.జోగినాయుడు అన్నారు. ట్రస్టు ఆధ్వర్యాన వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.ఆర్. గంజి, ప్రొఫెసర్ గంజి సంజీవయ్య వర్ధంతి సందర్భంగా నగరంలోని మదర్ థెరిస్సా హోంలో వృద్ధులు, వికలాంగులకు గురువారం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయస్సులోనే సిఎంగా, ఎఐసిసి అధ్యక్షుడిగా సంజీవయ్య రాష్ట్రానికి విశేషమైన సేవలు అందించా రన్నారు. ఆయనతో సాన్నిహిత్యం ఉన్న ఎస్.ఆర్.గంజి సంజీవయ్య పేరుతో ట్రస్టు ఏర్పాటు చేయడంతో పాటు తన కుమారుడికి అదే పేరు పెట్టారన్నారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఎజ్రా, ట్రస్టు సభ్యులు కాటం అనిరోజ్, న్యాయవాది కట్టా పార్థసారధి, ఎన్.కిరణ్, బి. రవీంద్ర బాబు, అప్పన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

పొందూరు: మండలం గోకర్ణపల్లి ప్రాథమిక పాఠశాలలో జిల్లా టిడిపి కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు చేతులుమీదుగా గురువారం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పాఠ్య పుస్తకాలతో కూడిన కిట్లును పంపిణీ చేశారు. హెచ్‌ఎం టి.రత్నకుమారి, టిడిపి నాయకులు గురుగుబెల్లి రామారావు, సీపాన వెంకటరమణారావు, గురుగుబెల్లి నర్సింగరావు, చౌదరి వెంకటరమణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆర్‌టిసి కాంప్లెక్స్ పరిశీలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చిన్నపాటి వర్షాలకు నగరంలో మురుగునీరు రోడ్లపైకి వచ్చి చేరుతోంది. ఎక్కడకక్కడ నీరు నిలిచి పోవడంతో నగరవాసులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం మధ్యాహ్నం వర్షం కురుస్తున్న సమయంలో బొందిలీపురం, ఇల్లీసుపురం, ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రాంతాల్లో పెద్దఎత్తున వర్షపునీరు నిలిచిపోయింది. వర్షం కురుస్తున్న సమయంలో ఆయా ప్రాంతాల్లో ఎమ్మెల్యే గొండుశంకర్ పర్యటించారు. నగరపాలక సంస్థ అధికారులు వెంటరాగా పూడుకు పోయిన కాల్వల్లో నీరు బయటకు వెళ్లనిస్థితిని చూసి వారితో చర్చించారు. ప్రధానంగా నగరంలో డ్రైనేజీవ్యవస్థ అధ్వాన్న స్థితిలో ఉందని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని అధికారులకు సూచించారు. తాత్కాలిక ఉపశమనం కలిగేలా కాల్వల్లో పూడికతీత పనులు అత్యవసరంగా చేపట్టాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ ప్రజారోగ్య శాఖాధికారి వెంకటరావు, ఇంజినీరింగ్ అధికారులు హాజరయ్యారు. అనంతరం ఆర్‌టిసి జిల్లా అధికారి విజయకుమార్‌తో ఆయన సమావేశమయ్యారు. ప్రయాణికుల అవస్థలను గుర్తించి వర్షపునీరు నిల్వ లేకుండా ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపాలని అధికారులకు సూచించారు.

హెరిటేజ్ పంపిణీ కేంద్రం ప్రారంభం

హెరిటేజ్ ఉత్పత్తుల పంపిణీ కేంద్ర సేవలను నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శంకర్ కోరారు. నగరంలో పాత బస్టాండ్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన హెరిటేజ్ పాల ఉత్పత్తుల కేంద్రం వెంకట దుర్గ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను అయన ప్రారంభించారు. యజమాని సంతోష్ పాల్గొన్నారు.

చందాల వసూలు నిరూపిస్తే దేనికైనా సిద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

స్థానిక యూబి పరిశ్రమ నుంచి తాను చందాలు, కప్పాలు, వసూలు చేసినట్టు నిరూపిస్తే ఎటువంటి చర్యలకైనా సిద్ధమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) పేర్కొన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ఒక పత్రికలో తాను పరిశ్రమ నుంచి ప్రతి పనికి డబ్బులు వసూలు చేసినట్లు నిరాధారమైన వార్తలను ప్రచురిస్తున్నారని దీనిపై తీవ్రంగా పరిగణిస్తామన్నారు. 2019 ముందు పరిశ్రమలో ఉత్పత్తి, ఆ తరువాత ఉత్పత్తి ఎందుకు తగ్గిపోయిందో అందరికీ తెలుసన్నారు. అప్పటి సిఎం జగన్మోహన్‌రెడ్డికి స్థానిక వైసిపి నాయకులకు చెప్పింది చేయకపోవడంతో కంపెనీ యాజమాన్యం తగ్గించుకొని కార్మికులకు ఉపాధి ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. స్థానిక వైసిపి నాయకులు ఎంత జులుం చేశారో ఆయన వివరించారు. గత రెండు దపాలుగా తన కుటుంబ సభ్యులే బంటుపల్లి సర్పంచ్‌గా ఉన్నా ఏనాడు ఒక రూపాయి వ్యక్తిగత అవసరాలకుగాని, ఎన్నికలకుగాని తీసుకోలేదని వివరించారు. ప్రస్తుతం పరిశ్రమ యాజమాన్యానికి, కార్మికులకు సయోజ్యగా ఉన్నానే తప్ప ఎటువంటి తప్పుడు పనులు చేయలేదన్నారు. పదేపదే ఆ పత్రిక బురదజల్లే కార్యక్రమాలు చేస్తుందని వివరించారు. గత ఐదేళ్లలో నియోజకవర్గ పరిధిలో వైసిపి నాయకులు చేసిన భూదందాలు, అక్రమాలు ప్రకటించడానికి సిద్ధంగా ఉన్నానని వాటిని ఆ పత్రిక ప్రచురించగలరా అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పిసిని జగన్నాధంనాయుడు, పిన్నింటి బానోజీనాయుడు, లెంక శ్యాం, ముప్పిడి సురేష్, బెండి మల్లేసు, లుకాలాపు అప్పలనాయుడు, వెలిచేటి సురేష్ కుమార్, దుమ్ము అశోక్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలి

ప్రజాశక్తి- పలాస

నిరుపేదలు ఉపాధి కోసం భూ యజమానుల దగ్గర నుంచి కౌలుకు తీసుకుని రైతులు పంటలు పండిస్తున్నారని, వారికి గుర్తింపు కార్డులు, రుణాలు మంజూరు చేయాలని సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ ఎస్.ఎస్.వి.ఎస్.నాయుడును గురువారం కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ యజమానుల భూమితో పాటు దేవాదాయ, ధర్మాదాయశాఖ సంబంధించిన భూములు సాగు చేసే వారు ఉన్నారని అన్నారు. వీరిని దృష్టిలో పెట్టుకొని కౌలు రైతుల కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దామాషాను బట్టి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి సున్నా వడ్డీకే పంట రుణాలు అందించాలన్నారు. పంట కాలువల్లో పేరుకుపోయిన పూడికను, గుర్రపు డెక్కను వెంటనే తొలగించి సాగునీరు అందించాలన్నారు. తిరుపతిరావు, వాసు, సుందరరావు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సిపిఐ నాయకులు

నరసన్నపేట : కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం నాయకులు వల్లంశెట్టి గిరి కోరారు. ఈ మేరకు డిటి రామ్మోహన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు సతీష్ పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి మేజర్ పంచాయతీ తెలకుల వీధిలో వృద్ధుడు అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. ఈ క్రమంలో కనీసం దహన సంస్కారాలు చేయడానికీ దిక్కుతోచని స్థితిలో ఉన్న కుటుంబం ఉంది. విషయం తెలుసుకున్న అభయం యువజన సేవా సంఘం సభ్యులు ఆర్థికసాయం చేసేందుకు ముందుకొచ్చింది. ఆ సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు మృతుని కుటుంబానికి గురువారం ఆర్థికసాయం, దహన సంస్కారాలకు అవసరమైన సామగ్రిని సమకూర్చారు.

పలాస : మండలంలోని బొడ్డపాడుకు చెందిన మద్దిల జోగారావు ఇటీవల మృతి చెందారు. దీంతో అతని భార్య రేవతి, ఇద్దరు కుమార్తెలు సిరి, హనీలు అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న దాతలు స్పందించి ఆర్థికసాయం అందించారు. వజ్రపుకొత్తూరు మండలం బైపల్లికి చెందిన అమ్మా- నాన్న ఛారిటబుల్ ట్రెస్టు ఆధ్వర్యాన మృతుని కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు పోతనపల్లి గీతమ్మ, అమ్మ-నాన్న ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మరడ గృహలక్ష్మి, ఉపాధ్యాయులు తెప్పల వాసుదేవరావు, మరడ మంజు పాల్గొన్నారు.

కంచిలి : మండలంలోని పాత అంపురానికి చెందిన ఏదూరు నారాయణ ఇటీవల మృతి చెందాడు. మతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడం, యజమాని మృతి చెందడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, పద్మతుల, ఎన్.అంపురం గ్రామస్తులు విరాళాలు సేకరించి రూ.28 వేలు మృతు భార్య పద్మ తులకు అందజేశారు.

ఎంపిడిఒ కార్యాలయం పరిశీలన

ఎచ్చెర్ల: స్థానిక ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు ఎంపిడిఒ కార్యాలయాన్ని గురువారం పరిశీలించారు. సమయం మించిన ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వివిధ శాఖలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. రికార్డులు నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈయనతో పాటు టిడిపి మాజీ జిల్లా అధ్యక్షులు చౌదరి బాబ్జీ, బిజెపి నియోజకవర్గ కో-కన్వీనర్ సంపతరావు నాగరాజు, టిడిపి నాయకులు బెండు మల్లేష్, జనసేన నాయకులు తంబినేని శ్రీనివాసరావు, తహశీల్దార్ శ్యాంకుమార్, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఎంపిడిఒ రమాదేవి, శోభారాణి ఉన్నారు. అలాగే దుప్పలవలస రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆకస్మిక తనిఖీ చేపట్టారు. స్కూల్ ప్రాంగణం మొత్తం కలియతిరిగి ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్కూల్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఒడియా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

కవిటి: శ్రీకాకుళం జిల్లా కంచిలి, సోంపేట, మందస మండలాల పరిధిలోని 8 ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలు, 3 ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఒడియా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొలై డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సహచర అపోటా సభ్యులతో కలిసి మాట్లాడారు. దీనిపై ఇప్పటికే రాష్ట్ర గిరిజన, మహిళ, శిశుసంక్షేమశాఖ మంత్రి జి.సంధ్యారాణికి లేఖ రాసినట్టు తెలిపారు. ముఖ్యంగా ఈ పాఠశాలల్లో ఒడియా మాధ్యమం ఎస్‌జిటి (ఒడియా) 16 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ 18, ఫిజికల్ ఎడ్యుకేషన్ 1, పిఇటి 1, లాంగ్వేజ్ పండిట్ (తెలుగు) 1 పోస్టులు దశాబ్దాల కాలంగా ఖాళీగానే ఉన్నట్టు చెప్పారు. 2012, 2014, 2018లో జరిగిన డిఎస్‌సిల్లో ఖాళీగా ఉన్న ఈ ఒడియా పోస్టులు నోటిపై చేయకుండా అన్యాయం చేశారని అన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న 15 మంది రెగ్యులర్ ఒడియా ఉపాధ్యాయులు మరో రెండేళ్లలో ఉద్యోగ విరమణ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. వారి తరువాత పాఠశాలల నిర్వహణ, విద్యాబోధనకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని సీతాంపేట ఐటిడిఎ పరిధిలోని ఒడియా పాఠశాలలో ఖాళీగా ఉన్న 37 ఒడియా మాధ్యమం ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని కోరారు.


మాట్లాడుతున్న బృందావన్ దొలై

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఇచ్ఛాపురం: సీజనల్ వ్యాధులపై వార్డులో ప్రజలు అప్రమత్తంగా ఉండాలనికౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్ అన్నారు. 22 వార్డులో వైద్య సిబ్బందితో కలిసి గురువారం ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పారిశుధ్య కార్యదర్శి ప్రియాంక, ఎఎన్ఎం కుమారి, అంగన్వాడీ కార్యకర్త కుండాల సురేఖ, జ్యోతి, ఆశావర్కర్ల సరోజ, కె.ఇందిర, రామలక్ష్మి, శోభారాణి పాల్గొన్నారు.

సోంపేట : వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజలంతా సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా


ఇచ్ఛాపురం : అవగాహన కల్పిస్తున్న దిలీప్‌కుమార్

ఉండాలని కొర్లం సర్పంచ్ ప్రతినిధి రాంబుడ్డి గణపతి అన్నారు. కార్యదర్శులు, ఆశ కార్యకర్తలతో కొర్లంలో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. ఆయనతో పాటు సచివాలయ సిబ్బంది, వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇకెవైసి తప్పనిసరి

ఇచ్ఛాపురం: గ్యాస్ వినియోగదారులు ఇకెవైసిని పొందాలని ఇచ్ఛాపురంలోని ఎస్‌విఎస్‌బి ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ ఏజెన్సి ప్రతినిధి వజ్రపు వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్యాస్ ఏజెన్సీ ఎల్‌పిజి గ్యాస్ వినియోగదారులు అందరూ ముఖం, గుర్తింపు, వేలిముద్ర స్కానర్ ద్వారా ఇకెవైసి పొందాలన్నారు. గ్యాస్ నియోగదారందరూ గ్యాస్ డెలివరీ చేసే వారి వద్ద, గ్యాస్ ఆఫీసులో ఇకెవైసి చేయించుకోవాలన్నారు. గ్యాస్ వినియోగదారులందరూ సహకరించాలని మీ మొబైల్ ఫోన్‌లో అందుకున్న ఒటిపిని అందించడం ద్వారా భద్రత తనిఖీని పొందాలని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాస్ సిలిండర్ల అర్హతను పొందటానికీ ఇకెవైసి తప్పనిసరి అన్నారు.

పక్కాగా స్టాప్ డయేరియా

ప్రజాశక్తి- బూర్జ

జూలై 1 నుంచి జరగనున్న స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని ఎంపిడిఒ రవీంద్రబాబు అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రాజశేఖర్ మాట్లాడుతూ సిబ్బంది, ఆశా కార్యకర్తలు సున్నా నుండి 5 ఏళ్లలోపు పిల్లలందరికీ ఒఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను ఇంటింటికి వెళ్లి అందజేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిని పి.రోజా, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ, ఎంఇఒ తదితరులున్నారు.

విద్యుత్ కోతలతో అవస్థలు

రణస్థలం: మండలంలో వేళాపాళా లేకుండా విద్యుత్ కోతలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. గత నెల రోజులుగా విద్యుత్‌కోతలు తరచూ ఉంటున్నాయని, మండలంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోందని విద్యుత్ వినియోగదారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్‌కోతలు నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ధ్వంసం చేసిన శిలాఫలకం

హెల్త్ క్లినిక్ శిలాఫలకం ధ్వంసం

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మేజర్ గ్రామ పంచాయతీలోని వైఎస్‌ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవన శిలాఫలకాన్ని బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. రాజకీయ కక్షలతో ఇలా ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయడం సబబుకాదని గ్రామస్తులు అంటున్నారు.


సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఎమ్మెల్యే శిరీషకు సన్మానం

మందస : పట్టణంలోని రాజా శ్రీనివాస మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చారిత్రాత్మకమైన ముందరి భవనానికి మరమ్మతులు చేసేందుకు అవసరమైన అనుమతులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష హామీనిచ్చారు. ఈ మేరకు పూర్వ విద్యార్థులు, పట్టణ పెద్దలు కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వడ్డి చంద్రశేఖరం, సీతారామ శర్మ, సోమనాథ్, ప్రభాకర్, కేశవరావు, తిరుపతి, సింహాచలం, శ్రీనిబాస్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

హెల్మెట్ వినియోగంపై అవగాహన

ఇచ్ఛాపురం: ప్రతిఒక్కరూ హెల్మెట్ వినియోగంతో ప్రమాదాల నియంత్రణకు దోహదపడుతుందని రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు సూచించారు. మండలంలోని భవానీపురం వద్ద రాకపోకలు సాగిస్తున్న వాహనదారులకు హెల్మెట్ వాడకంపై గురువారం అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల్లో చాలా వరకు హెల్మెట్ లేకే ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయని వివరించారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ దరించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.


పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి నాయకుల పరామర్శ

నౌపద : సంతబొమ్మాళి మండల జనసేన పార్టీ అధ్యక్షులు లింగూడు కుమార్ అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న నౌపద పంచాయితీ టిడిపి నాయకులు సుగ్గు శాంతిస్వరూప్‌రెడ్డి, నాయకులు గురువారం పరామర్శించారు. ఈ మేరకు సీతానగరంలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట మహంతి రాజు, కర్రి బాలకృష్ణ, తిప్పన రాజు, సాహుకారి రవి ఉన్నారు.

గ్రామ సంఘాలతో సమీక్ష

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రతి గ్రామంలోనూ వ్యవసాయ భూమి ఉన్న సభ్యులతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయాలని వెలుగు ఎపిఎం ఎం.ప్రసాదరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం గ్రామ సంఘాల విఒఎలతో సమీక్షించారు. అంతర్గత పొదుపులు, ప్రతి సంఘమూ బ్యాంకులో పొదుపు చేసుకున్న సొమ్ము, వారి అవసరాలకు అంతర్గత అప్పు రూపంలో నిబంధనలు విధించకుండా మంజూరు చేయడంపై సూచనలు ఇచ్చారు. సమావేశంలో బ్యాంకు మేనేజర్ శేఖర్ బెహరా, ఫీల్డ్ ఆఫీసర్ మెరిన్ మై, సిసిలు లక్ష్మి, మోహనరావు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో పచ్చని పంట

ప్రజాశక్తి- కవిటి

రైతులు తమ పొలాలు, తోటల్లో పచ్చిరొట్ట విత్తనాలు చల్లి అవి ఏపుగా పెరిగిన తర్వాత భూమిలో కలియ దున్నడం వల్ల అధిక దిగుబడులతో పాటు పచ్చని పంట పండుతుందని ఎడిఎ జగన్మోహనరావు అన్నారు. మండలంలోని పుటియాదల పొలాల్లో రైతులు వేసిన పచ్చిరొట్ట మొక్కలను గురువారం పరిశీలించారు. అనంతరం స్థానిక రైతులతో మాట్లాడి పలు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు మాదిన, సమన్వయ పాల్గొన్నారు.